


# కెరటం న్యూస్
(సామాన్యుడి ఆయుధం)





Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 193 | బుధవారం 12 ఆగస్టు 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695











# ‘8 ప్లస్ 8 ఈక్వల్ టు జీరో’..



- టెసేరాక్ భూకేటాయింపులపై కేటీఆర్ ఫైర్
- రూ.200 కోట్ల భూమిని అప్పనంగా కట్టబెట్టారు
- ఒక్క ఉద్యోగి లేని కంపెనీకి వేల కోట్ల విలువైన భూమి ఎందుకు?
- కొండల్‌రెడ్డికి ఏమైనా ప్రత్యేక కేటగిరీ ఉందా?
- 74 లక్షల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందా?
- కన్నెపల్లి పంప్‌హౌస్ పంపులు వెంటనే ఆన్ చేయాలి
- పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా సాధించలేరా? - కేటీఆర్ ఫైర్

హైదరాబాద్,11 ఆగస్టు ( కెరటం న్యూస్): తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా టెసేరాక్ సంస్థకు భూకేటాయింపుల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు.

ఒక్క ఉద్యోగి కూడా లేని, కేవలం రూ.లక్ష మూలధనంతో ఏర్పాటు చేసినట్లు చెబుతున్న సంస్థకు పఠాన్‌చెరులో భారీ విలువైన భూమిని ఎలా కేటాయించారని కేటీఆర్ ప్రశ్నించారు. గజానికి సుమారు రూ.7 వేల చొప్పున రూ.200 కోట్లకు పైగా విలువ చేసే భూమిని అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. అనుముల కొండల్‌రెడ్డి సంస్థకు తానే చైర్మన్‌గా ప్రకటించుకున్నారని పేర్కొంటూ.. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల పాత్రపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# “ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం”

## దేశ ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు..



స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవం, గర్వం, ఘనతతో జరుపుకోవాలని, అభివృద్ధి చెందిన భారత్ కోసం ప్రతిజ్ఞ చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.



# 22ఏ నిషేధిత భూములపై ఆందోళన అవసరం లేదు

- భూముల రిజిస్ట్రేషన్లపై కీలక నిర్ణయాలు.. సబ్ రిజిస్ట్రార్లకు మంత్రి స్పష్టమైన సూచనలు
- బోగస్ డాక్యుమెంట్లకు చెక్.. భూ రికార్డుల డిజిటలైజేషన్‌పై పొంగులేటి ఫోకస్
- నిజమైన బాధితులకు వెంటనే ఊరట కల్పించాలి: కలెక్టర్లకు మంత్రి ఆదేశం

## తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా

# తీర్చిదిద్దడమే లక్ష్యం

:మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్,11 ఆగస్టు ( కెరటం న్యూస్): : తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# యంగ్ ఇండియా స్కూళ్లు..

# పేద పిల్లల కలలకు పునాదులు

- భవనాలు కాదు.. భవిష్యత్తును నిర్మిస్తున్నాం
- ప్రతి నియోజకవర్గంలో ప్రపంచస్థాయి విద్య..
- పేద పిల్లలకు నాణ్యమైన విద్యే లక్ష్యం
- రేపటి తరానికి జ్ఞాన మందిరాలు.. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్

– సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్11 ఆగస్టు ( కెరటం న్యూస్ న్యూస్): తెలంగాణలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. భవనాలు నిర్మించడం సులభమేనని, కానీ విద్యార్థుల కలలకు బలమైన పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం అవసరమని అన్నారు. ఆ సంకల్పంతోనే రాష్ట్రంలో ఈ పాఠశాలల నిర్మాణాన్ని వేగంగా చేపడుతున్నామని తెలిపారు.

కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం వంటి భేదాలు లేకుండా ప్రతి చిన్నారికి ప్రపంచస్థాయి విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. ఆర్థిక, సామాజిక అసమానతలను తొలగించేందుకు నాణ్యమైన విద్య కీలకమని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఈ పాఠశాలలు పేద కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్యను అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తాయని రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులను భవిష్యత్‌లో శాస్త్రవేత్తలు, పరిపాలకులు, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రాలుగా ఇవి నిలుస్తాయని పేర్కొన్నారు.

పేద పిల్లల కలలకు చిరునామాగా, తెలంగాణ అభివృద్ధి నమూనాకు ప్రతీకగా యంగ్ ఇండియా స్కూల్స్ నిలుస్తాయని సీఎం తెలిపారు. ఈ పాఠశాలలు కేవలం విద్యను అందించే కేంద్రాలుగా కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తును మార్చే సంస్థలుగా రూపుదిద్దుకుంటాయని ఆయన వెల్లడించారు.



# రాజ్యసభలో ‘ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు’కు ఆమోదం..

## నియామకాల కోసం ప్రత్యేక ప్యానెల్

- ట్రిబ్యునళ్ల నియామకాలకు నేషనల్ ట్రిబ్యునల్ కమిషన్
- ట్రిబ్యునళ్ల సభ్యుల ఎంపికలో పారదర్శకతే లక్ష్యం: కేంద్ర మంత్రి
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ట్రిబ్యునల్ కమిషన్




# నీట్ రద్దుకు తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

నీట్ ను రద్దు చేయాలనే తీర్మానాన్ని ఆరోగ్య శాఖ మంత్రి కె.అరుణ్ రాజ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. కేంద్రం నిర్వహిస్తున్న నీట్ పరీక్ష సామాజిక న్యాయం, సమానాత్వం, రాష్ట్రాల హక్కులకు వ్యతిరేకం అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అండర్ గ్రాడుయేట్ మెడికల్ అడ్మిషన్స్ వ్యవస్థను ఏకరీతిన నిర్వహిస్తున్న నీట్ వ్యవస్థ నుంచి వేరు చేసి రాష్ట్రాలకే వదిలేయాలని తీర్మానంలో పేర్కొన్నారు.

# నీట్ రద్దుకు తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

మొదటి పేజీ తరువాయి




కేంద్రం నిర్వహిస్తున్న నీట్ విధానం వలన గ్రామీణ, ఆర్థికంగా వెనకబడిన తరగతుల విద్యార్థులకు.. ముఖ్యంగా తమిళ్ మీడియంలో చదువుతున్న విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతున్నట్లు ఆరోపించారు. 12 ఏళ్ల స్కూలింగ్ తర్వాత.. సింగిల్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించడం వలన.. విద్యార్థులు పూర్తిగా కోచింగ్ సెంటర్లపై ఆధారపడే పరిస్థితి ఏర్పడిందనీ.. దీని వలన విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతున్నట్లు పేర్కొన్నారు.

తమిళనాడులో మెడికల్ కోర్సుల అడ్మిషన్లు ఇంటర్ మార్కుల ఆధారంగా నిర్వహించాలని ప్రతిపాదించింది.

నీట్ పై డిబేట్ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే భోజరాజన్. ప్రభుత్వ తీర్మాన్ని వ్యతిరేకించారు. నీట్ విద్యార్థులకు మంచి అవకాశం అంటూ.. ప్రభుత్వ తీర్మానానికి వ్యతిరేకంగా వాకౌట్ చేశారు.

## మంత్రి పదవి కోసం కాదు..

### బాన్సువాడ అభివృద్ధి కోసమే పార్టీ మారా: పోచారం

కామారెడ్డి,11 ఆగస్టు ( కెరటం న్యూస్): : బీర్కూరు చెక్‌డ్యామ్ వద్ద నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మంత్రి పదవి, డబ్బు కోసం కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే పార్టీ మారాల్సి వచ్చిందని తెలిపారు. కేసీఆర్‌ను మోసం చేసి పార్టీ మారడం తనకు ఇష్టం లేదని, అయితే అప్పటి పరిస్థితుల కారణంగా ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు.

తాను కాంగ్రెస్ పార్టీ జెండాను కాదని, కేవలం జాతీయ జెండాను మాత్రమే కప్పుకున్నానని పోచారం వ్యాఖ్యానించారు. పార్టీ మారిన సమయంలో ఆరు నెలల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని, అయితే పార్టీ కండువా కప్పుకున్న తర్వాత సగం నిధులు మాత్రమే విడుదలయ్యాయని ఆరోపించారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిలిపివేశారని తెలిపారు.

గతేడాది నవంబర్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించిన సమయంలో తాను సీఎంను నేరుగా ప్రశ్నించానని పోచారం తెలిపారు. "నేను నీకు అమ్ముడుపోయానా? నా ఎమ్మెల్యే పదవిని కొన్నావా?" అంటూ నిలదీసినట్లు వెల్లడించారు.

బాన్సువాడ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని పలుమార్లు కోరినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని పోచారం అన్నారు. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి కూడా తమ ఫోన్లకు స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

కేసీఆర్ హయాంలోనే బాన్సువాడ అభివృద్ధి

బాన్సువాడ నియోజకవర్గంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గణనీయమైన అభివృద్ధి జరిగిందని పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. తనకు గతంలో అండగా నిలిచిన వారిని ఎప్పటికీ మర్చిపోనని చెప్పారు. కొంతమంది వ్యక్తుల కారణంగానే తాను పార్టీ మారాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మందగించినప్పటికీ కార్యకర్తలు అధైర్యపడవద్దని పోచారం సూచించారు. రాబోయే రోజుల్లో బాన్సువాడలో మళ్లీ తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

## 22ఏ నిషేధిత భూములపై ఆందోళన అవసరం లేదు : మంత్రి పొంగులేటి

హైదరాబాద్,11 ఆగస్టు ( కెరటం న్యూస్): 22ఏ నిషేధిత భూముల అంశంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల సమస్యలు, రిజిస్ట్రేషన్లు, నిషేధిత జాబితా అంశాలపై అధికారులతో చర్చించారు.

ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా ఎలాంటి భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలం నుంచి కొనసాగుతున్న సాంకేతిక సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఫోర్జరీ, నకిలీ పత్రాల ద్వారా జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు భూ రికార్డులను డిజిటల్ విధానంలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ అనుమతులకు సంబంధించిన పత్రాలను ఆగస్టు 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పహాణీ వివరాలను సైతం సబ్ రిజిస్ట్రార్లు పరిశీలించే అవకాశం ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.పీఓబీ దరఖాస్తుల విషయంలోనూ మంత్రి కీలక సూచనలు చేశారు. ఇకపై అలాంటి దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయాలకు పంపకుండా నేరుగా కలెక్టర్లకు పంపే విధంగా ప్రక్రియను మార్చాలని స్పష్టం చేశారు. పీఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను పరిశీలన లేకుండా తిరస్కరించవద్దని అధికారులకు సూచించారు. అవసరమైన పరిశీలన కోసం మూడు రోజుల సమయం తీసుకుని, రిజిస్ట్రేషన్ తిరస్కరణకు స్పష్టమైన కారణాలను తెలియజేయాలని ఆదేశించారు.

సబ్ రిజిస్ట్రార్లకు అదనపు విచక్షణాధికారాలు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ఆధారంగానే నిర్ణయాలు తీసుకునేలా వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ భూములు, ఆస్తుల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి హెచ్చరించారు. విధుల్లో చిన్న తప్పిదం చేసినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మరోవైపు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, వాటిలో నిజమైనవి, అర్హమైనవి ఏవో గుర్తించాలని కలెక్టర్లకు సూచించారు. అర్హత ఉన్న బాధితులకు వీలైనంత వేగంగా న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు.

# పాతబస్తీ మెట్రోకు సీఎం రేవంత్ బూస్ట్..

### పనులు వేగవంతం చేయాలని ఆదేశం



హైదరాబాద్,11 ఆగస్టు ( కెరటం న్యూస్): : హైదరాబాద్ మెట్రో రెండో దశలో భాగంగా చేపట్టనున్న పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌పై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో పాతబస్తీ మెట్రోకు సంబంధించిన పలు అంశాలపై ఆయన కీలక సూచనలు చేశారు.

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ప్రతిపాదించిన 7.5 కిలోమీటర్ల మెట్రో కారిడార్‌కు అవసరమైన రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఈ మార్గంలో మెట్రో నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రాజెక్టు కోసం ఇంకా పూర్తి కావాల్సిన భూసేకరణ ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా ముగించాలని స్పష్టం చేశారు.

హైదరాబాద్ మెట్రోలో ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నందున అందుకు అనుగుణంగా సౌకర్యాలు పెంచాలని సీఎం అన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని మెట్రో రైళ్లకు అదనపు బోగీలను జత చేయాలని, అవసరమైన కోచ్‌ల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

మెట్రో ఫేజ్-2లోని ఎంజీబీఎస్--చాంద్రాయణగుట్ట కారిడార్ నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు తీసుకుని ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.

డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపైనా సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

వివిధ రంగాల్లో విశేష గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్ సందర్భంగా సత్కరించేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. తెలంగాణలోకి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే విధంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సదస్సు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు.

గత ఏడాది నిర్వహించిన సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను తనకు అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. భవిష్యత్‌లో పెట్టుబడులను మరింత పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో రూ.200 కోట్ల సోలార్ స్కామ్?



హైదరాబాద్,11 ఆగస్టు ( కెరటం న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200 కోట్ల సోలార్ కుంభకోణానికి పాల్పడిందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉచిత విద్యుత్ పథకం కింద కేంద్రం అందిస్తున్న సబ్సిడీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు.

40 వేల ఇళ్ల సోలార్ ప్రాజెక్టుపై ఆరోపణలు

'హర్ ఘర్ బిజిలీ ముక్త్ యోజన'లో భాగంగా రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 40 వేల ఇళ్లను ఎంపిక చేసి, వాటిపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారని రఘునందన్ రావు తెలిపారు. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ఓ సంస్థకు రూ.1.36 లక్షల చొప్పున కాంట్రాక్ట్ ఇచ్చారని, అదే పనిని ఆ సంస్థ సబ్‌కాంట్రాక్ట్ ద్వారా రూ.86 వేలకే అప్పగించిందని ఆయన పేర్కొన్నారు. దీంతో ఒక్కో ఇంటిపై సుమారు రూ.50 వేల వ్యత్యాసం ఏర్పడుతోందని, 40 వేల ఇళ్లను కలిపితే దాదాపు రూ.200 కోట్ల మేర అక్రమాలు జరిగే అవకాశం ఉందని ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వం సోలార్ ఏర్పాట్లకు 1 కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేల వరకు సబ్సిడీ అందిస్తోందని రఘునందన్ రావు తెలిపారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు.

ఈ ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేంద్రం నుంచి వచ్చే నిధులపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

పార్లమెంట్‌లో ప్రతిపక్షాల తీరుపై విమర్శలు

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంపైనా రఘునందన్ రావు స్పందించారు. సభను సమర్థంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్ష పార్టీలపై సమానంగా ఉంటుందని అన్నారు.

ఢిల్లీ విద్యార్థుల ఆందోళన అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతిపక్షాలు సభను అడ్డుకుంటున్నాయని విమర్శించారు. కేంద్ర హోంశాఖ మంత్రి ఈ అంశంపై సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రతిపక్షాల నిరసనల కారణంగా ఇతర ఎంపీలు ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశం కోల్పోతున్నారని రఘునందన్ రావు పేర్కొన్నారు.

# "ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం"..

మొదటి పేజీ తరువాయి

అధికార ఎన్డీయే కూటమి "మంగళ్ మిలన్" సమావేశానికి హాజరైన సందర్భంగా ఎన్డీయే ఎంపీలు, కేంద్ర మంత్రులకు త్రివర్ణ జెండాలను ఊపుతూ 'వందేహాతరం', 'భారత్ మాతాకి జై' నినాదాలతో ఆయనకు స్వాగతం పలికిన వీడియోను మోడీ షేర్ చేశారు.

"మన స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పిద్దాం, అభివృద్ధి చెందిన భారత్ కోసం ప్రతిజ్ఞ చేద్దాం. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేద్దాం. భారత్ మాతా కీ జై, వందే మాతరం" అని మోడీ తన వీడియోలో సందేశం ఇచ్చారు. అంతకుముందు పార్లమెంట్ హౌజ్‌లోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశానికి చేరకున్న మోడీకి ఎన్డీయే నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశానికి బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్‌తో సహా కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, ఎస్ జైశంకర్ హాజరయ్యారు. ఎన్డీయే భాగస్వామ్యపక్ష నేతలు కూడా పాల్గొన్నారు.

## రాజ్యసభలో 'ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు'కు ఆమోదం..

దేశంలోని వివిధ ట్రిబ్యునళ్ల అధ్యక్షులు, సభ్యుల ఎంపిక కోసం 'నేషనల్ ట్రిబ్యునల్ కమిషన్' ని ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ప్రతిష్టాత్మక ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు-2026 కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును ఇప్పటికే సోమవారం లోక్‌సభ ఆమోదించగా, తాజాగా ఎగువ సభ అయిన రాజ్యసభ ఆమోదముద్ర వేసింది. అయితే, ఈ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడేందుకు రాజ్యసభ చైర్మన్ అనుమతించలేదని నిరసిస్తూ 'ఇండియా' కూటమికి చెందిన ప్రతిపక్ష పార్టీల సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అయితే, బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ సమాధానమిచ్చారు. దేశంలో అభ్యర్థులకు, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో ట్రిబ్యునళ్లు కీలక పూరక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. ఇక నేషనల్ ట్రిబ్యునల్ కమిషన్‌కు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి.. లేని పక్షంలో హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు. ఇందులో ఇద్దరు జుడీషియల్ సభ్యులు, ఇద్దరు సాంకేతిక మెంబర్స్ కూడా ఉంటారని తెలిపారు. ఈ కమిషన్ ద్వారా ట్రిబ్యునళ్ల సభ్యుల నియామకాలు అత్యంత పారదర్శకంగా, స్వతంత్రంగా, ప్రతిభ ఆధారంగా జరుగుతాయని మంత్రి అర్జున్ రామ్ మెఘ్‌వాల్ సభలో స్పష్టం చేశారు.

## తెలంగాణను హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్,11 ఆగస్టు ( కెరటం న్యూస్): తెలంగాణను హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో పాటు సిఫిలిస్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటలకు ఐమాక్స్ సమీపంలోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ నుంచి ర్యాలీ ప్రారంభమై నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 1,500 మంది పాల్గొంటారని తెలిపారు.

హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారికి మెరుగైన వైద్య సేవలు, చికిత్స అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పేర్కొన్నారు. వైరస్ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలన కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్‌ఐవీ పాజిటివ్' అనే నినాదంతో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ర్యాలీలో కళాశాల విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించనున్నారు. హెచ్‌ఐవీపై అవగాహన పెంచడం, అపోహలను తొలగించడం ద్వారా రాష్ట్రాన్ని హెచ్‌ఐవీ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి కోరారు.

## '8 ప్లస్ 8 ఈక్వల్ టు జీరో'..

మొదటి పేజీ తరువాయి

టెసేరాక్ సంస్థకు సీఎం కుటుంబంతో ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. అయితే సంబంధం లేకపోతే కొండల్‌రెడ్డి ఆ సంస్థకు చైర్మన్‌గా ఎలా ప్రకటించుకున్నారని ప్రశ్నించారు. కొండల్‌రెడ్డి కుమారుడు సంస్థ తరఫున ఇంటర్వ్యూలు ఇవ్వడంపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. కర్ణాటకలో భూ కేటాయింపులపై లోకాయుక్తను ఆశ్రయించిన తరహాలోనే తెలంగాణలోనూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

ఓటర్ల జాబితాపై బీఆర్‌ఎస్ అలర్ట్

రాష్ట్రంలో 74 లక్షల ఓట్లు తొలగించే అవకాశం ఉందన్న ప్రచారంపై కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆగస్టు 17న ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశామని తెలిపారు. జిల్లా కమిటీలతో సమావేశాలు నిర్వహించామని, అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగించకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామని చెప్పారు.

వరుణ యాగంపైనా విమర్శలు : వరుణ యాగం నిర్వహణపై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే యాగాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. యాగాలు చేయడం తప్పు కాదని, అదే సమయంలో ప్రభుత్వం చేయాల్సిన పనులు కూడా చేయాలని సూచించారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో వెంటనే పంపులు ఆన్ చేయాలని డిమాండ్ చేశారు.

'8 ప్లస్ 8 ఈక్వల్ టు జీరో'

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకపోవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణలో 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి ఏ ఒక్క ప్రాజెక్టుకూ జాతీయ హోదా తీసుకురాలేకపోయారని విమర్శించారు. '8 ప్లస్ 8 ఈక్వల్ టు జీరో' అంటూ సెటైర్ వేశారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు బీఆర్‌ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

కెరటం న్యూస్ (సామాన్యుడి ఆయుధం)

బుధవారం 12 ఆగస్టు 2026

# కామ్రేడ్ సీతక్క కు విప్లవ జోహార్లు..

## సీపీఐఎంఎల్ మాస్ లైన్



ఖమ్మం టౌన్,కెరటం న్యూస్

కమ్యూనిస్ట్ విప్లవోద్యమ నాయకురాలు, దాదాపు 30 సంవత్సరాల పాటు అడవిలో సాయుధ సభ్యురాలుగా పనిచేసిన కామ్రేడ్ గంగసాని సీతక్క ఈరోజు సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. ఆమెకు విప్లవ జోహార్లు. కామ్రేడ్ సీతక్క సీనియర్ నేత కామ్రేడ్ ధర్మన్న జీవిత సహచరి. సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకురాలు కామ్రేడ్ కల్పనక్క , పార్టీ సభ్యులు గంగాసాని కృష్ణ మాతృ మూర్తి. కామ్రేడ్ ధర్మ న్న , సీతక్క ( సరోజినీ .. అసలు పేరు) లది బొనకల్ మండలం బ్రహ్మణపల్లి గ్రామం. కామ్రేడ్ ధర్మ న్న తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచి కమ్యునిస్ట్ పార్టీ నాయకుడు. అజ్ఞాత వాసం లో పనిచేశారు. 1970 తరువాత గోదావరి లోయ పోరాట ప్రభావంతో తిరిగి అజ్ఞాతం లోకి వెళ్లి ఇల్లందు, పాల్వంచ, పోలవరం అటవీ ప్రాంతంలో అజ్ఞాత దళ నేతగా, జిల్లా, రాష్ట్ర నాయకుడిగా ఆదివాసీ, పేద ప్రజల కోసం పోరాటం చేశారు. ఈ క్రమం లో ఎన్కౌంటర్ లో చనిపోయారు. కామ్రేడ్ సరోజినీ ధర్మ న్న తో కలసి ఎమర్జెన్సీ కాలంలో అజ్ఞాత జీవితానికి వెళ్లారు పిల్లలను ఇంటి వద్దనే విడిచి వెళ్లి భర్త తో పాటు అడవిలో సాయుధ దళాల నేతగా పని చేశారు. 15 సంవత్సరాల క్రితం అనారోగ్యం, వృద్ధాప్యం




కారణంగా బయట వుంటున్నారు. కామ్రేడ్ సీతక్క కు ఇద్దరు కుమార్తెలు. ఒక కుమారుడు. తమ జీవితాన్ని విప్లవోద్యమం కోసం అంకితం చేసిన సీతక్క, వారి జంట ఆదర్శ మూర్తులు. సీతక్క కు విప్లవ జోహార్లు అర్పిస్తున్నాం. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

# సీతక్కకు నివాళులు




ఖమ్మం టౌన్, కెరటం న్యూస్

కామ్రేడ్ సీతక్క భౌతికాయంపై సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి సివైపుల్లయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామయ్య ఆవుల వెంకటేశ్వర్లు ఆవుల అశోకు శిరోమణి,టీ ఝాన్సీ, పి శోభ, శివకుమార్, కొత్తపల్లి రేణుక,పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు రాయల రవికుమార్, అడ్వకేట్ కందాల క్రాంతికుమార్ పోటు శ్రీనివాస్ , సీతక్క కుమారుడు గంగసాని కృష్ణ, కోడలు రమాదేవి,అరుణ పతాకాన్ని కప్పి, పుష్పగుచ్చాలు ఉంచి, ఘనంగా శ్రద్ధాంజలి ఘటించటం జరిగింది.

# భట్టి విక్రమార్క కృషితో గ్రామీణ రహదారుల అభివృద్ధి

## రూ.6.80 కోట్లతో నిర్మిస్తున్న రేపల్లెవాడ--లక్ష్మీపురం--పొద్దుటూరు రహదారి పరిశీలన



చింతకాని, కెరటం న్యూస్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క కృషితో రేపల్లెవాడ నుంచి లక్ష్మీపురం మీదుగా పొద్దుటూరు వరకు రూ. 6.80 కోట్ల నిధులతో నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ముఖ్య నాయకులుతో కలిసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నెబోయిన గోపి యాదవ్ మాట్లాడుతూ.. చింతకాని మండలంలో ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు రైతుల పేరుతో రాజకీయాలు చేస్తూ అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.

నిన్న నాగులవంచ గ్రామంలో అంబటి వెంకటేశ్వరరావుపై దురుద్దేశపూర్వకంగా ఒక రైతును అడ్డం పెట్టుకుని విమర్శలు చేయడం సరికాదన్నారు. భట్టి విక్రమార్క సారథ్యంలో చింతకాని మండలంతో పాటు నాగులవంచ గ్రామంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరుగుతోందని, ఈ అభివృద్ధి పనుల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు కీలక పాత్ర పోషిస్తున్నారని గోపి యాదవ్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, అడ్డంకులు సృష్టించినా భట్టి విక్రమార్క గారి నేతృత్వంలో మధిర నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్, మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవిందరావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, నాగులవంచ మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కంచుమర్తి రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు మడుపల్లి రాంప్రసాద్, రైతులు మడుపల్లి చిన్న నాగేశ్వరరావు, మడుపల్లి వెంకటేశ్వర్లు, బొర్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి జూనియర్ కాలేజీ సమస్యలు పరిష్కరించాలి

కారేపల్లి, కెరటం న్యూస్ :

జూనియర్ కాలేజీ విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం. ఉన్నత అధికారులు సవతి తల్లి ప్రేమ చూపుతున్నారు

PDSU. PYL. డిమాండ్

ఈరోజు స్థానికమైన కారేపల్లి మండల కేంద్రంలోని గల ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. చాలా దూరభార ప్రాంతాల నుంచి ఎస్సీ. ఎస్టి. బిసి. మైనార్టీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. లెక్చరర్స్ సరిపడి లేక తరగతి గదులు లేక లైవ్ బరి లేక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు గొప్పలు చెప్పే రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నత అధికారులు విద్యార్థులకు వాన వస్తే వలవల గాలి వస్తే గలగల పరిస్థితి కాలేజీలో ఏర్పడినది విద్యార్థులకు తక్షణమే లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రెండు జతల యూనిఫాం. మధ్యాహ్నం భోజనం. కాలర్ షిప్ లు తక్షణమే సమస్యలను పరిష్కరించి స్కాలర్షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు మండల అధ్యక్షుడు కుమార్. ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ తెలంగాణ రాష్ట్ర నాయకులు భూక్య శివా నాయక్ ఒక ప్రకటనలో విడుదల చేశారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

## బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్. మల్లారెడ్డి



కెరటం న్యూస్, అత్తాపూర్: దేశభక్తిని చాటిచెప్పే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా అత్తాపూర్ డివిజన్ హైదర్గూడలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్. మల్లారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సాగుతున్న ఈ ఉద్యమంలో భాగంగా ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు తమ ఇంటిపై జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, అత్తాపూర్ డివిజన్ పరిధిలో దేశభక్తి ఉట్టిపడేలా పెద్ద ఎత్తున 'తిరంగా యాత్ర' నిర్వహించాలని కోరారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సన్నాహక సమావేశంలో జిల్లా ఆఫీస్ సెక్రటరీ విజయ్ కుమార్, సిద్ధేశ్వర్, జి. రాజు, అత్తాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, అనురాధ, శివరాజ్ గౌడ్, సతీష్, శ్రీనివాస్, లక్ష్మీకాంత్ రెడ్డి, మణికంఠ, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తీర్మానించారు.

# ఆదివాసీలకు పౌష్టికాహారం, రక్షిత మంచినీరు అందించాలి

## అడ ప్రాజెక్ట్, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి

## కొమరం భీమ్ వర్ధంతి నాటికి కెరమెరి నుంచి జోడేఘాట్ వరకు డబుల్ రోడ్డు వేయాలి

## తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత

## టీఆర్ఎస్ లో పలువురు ఆదివాసీ నాయకుల చేరిక

కెరటం న్యూస్,హైదరాబాద్ :

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలకు పౌష్టికాహారం, రక్షిత తాగునీటిని అందించాలని, ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఆదివాసీ నాయకులు, తెలంగాణ ఆదివాసీ టైగర్ సేన నాయకులు మంగళవారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేనలో చేరారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్ వర్ధంతి నాటికి కెరమెరి నుంచి జోడేఘాట్ వరకు డబుల్ రోడ్డు నిర్మించాలన్నారు. అడ ప్రాజెక్టు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల కాల్వలు ఆధునీకరించి మొత్తం 60 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లివ్వాలని డిమాండ్ చేశారు. పోడు సమస్య పరిష్కరించాలని.. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన హక్కుల పత్రాలకు సంబంధించిన భూములు వెంటనే ఆదివాసీలకు అప్పగించాలని కోరారు. ఇందుకోసం ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించాలన్నారు. ఆదివాసీలకు అండగా ఉండటం కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలు నామ్ కే వాస్తేగా మారిపోవడం దురదృష్టకరమన్నారు. ఆదివాసీ నాయకుడు సోయం బోజారావు గుట్టబండపై మట్టి పోసి పంటలు సాగు చేయడం ఆదివాసీల దుర్భర స్థితిగతులను తెలియజేస్తుందన్నారు. త్వరలోనే ఆదివాసీ ప్రాంతాలను సందర్శిస్తామని, ఆదివాసీలకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కోట్నక కిషన్ రావ్, పెందోర్ ధర్ము, పెందోర్ దౌలత్ రావ్ తదితరులు టీఆర్ఎస్ లో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్దన్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్ చార్జీ కావేటి సబిత తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ హాస్పిటల్స్ లో పని చేసే నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలి

## నర్సుల హక్కుల కోసం ప్రైవేట్ హాస్పిటల్స్ తో ప్రభుత్వం చర్చించాలి

## తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత




కెరటం న్యూస్, హైదరాబాద్ : ప్రైవేట్ హాస్పిటల్స్ లో పనిచేసే నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవటం బాధకరమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తనను కలిసిన ప్రైవేట్ హాస్పిటల్స్ నర్సులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు పెద్ద ఎత్తున ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయని.. అయినా ఆయా హాస్పిటల్స్ లో పనిచేసే సిబ్బందికి మాత్రం ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కనీసం హెల్త్ ఇన్సూరెన్స్ వాళ్లకు లేకపోవడం సరికాదన్నారు. వెంటనే ఈ విషయంపై ప్రభుత్వం ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలతో చర్చించి వారికి ఇన్సూరెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పనివేళలు, జీతాలు, ఓవర్ టైమ్ వంటి అంశాల్లో తెలంగాణాకు చెందిన ఉద్యోగులను ఇబ్బంది పెడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రైవేట్ హాస్పిటల్స్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ లో పనిచేసే సిబ్బందికి, నర్సులకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ వాసవి మాతకు కుంకుమ పూజ



కెరటం న్యూస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో మంగళవారం శ్రీ వాసవి మాతకు కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం భక్తులందరికీ కుటుంబ సమేతంగా భోజనాలు ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య మండల కమిటీ అధ్యక్షులు మంచి విజయగుప్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం భక్తి వాతావరణంలో కొనసాగింది.

# అంతరిక్షం నుంచి భారత ప్రజలకు తొలి శుభాకాంక్షలు



కెరటం న్యూస్ :తొలిసారి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి రష్యా వ్యోమగాములు భారత ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత త్రివర్ణ పతకాన్ని చేతిలో పట్టుకొని ప్రేమను చాటుకున్నారు. భారత్-రష్యా స్నేహాన్ని ప్రస్తావిస్తూ సోమవారం ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని పంపారు. వ్యోమగామి ఆంద్రీ ఫెద్యాయేవ్ 'భారత్-రష్యా స్నేహం వర్ధిల్లాలి' అని అన్నారు. మాస్కో-న్యూఢిల్లీ మధ్య సుదీర్ఘ సహకార సంబంధాల్లో అంతరిక్ష పరిశోధన ఒక కీలకమైనదని వారు అభివర్ణించారు. భారత ప్రజలకు శాంతి, శ్రేయస్సు కలుగాలని రష్యన్ వ్యోమగామి ప్యోటర్ దుబ్రోవ్ ఆకాంక్షించారు.

# తిప్పవరప్పాడు వద్ద తప్పిన పెను ప్రమాదం

## కాలువలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

## ప్రయాణికులు అందరూ క్షేమం



నెల్లూరు జిల్లా గూడూరు (కెరటం న్యూస్): -గూడూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో వెళ్తుండగా తిప్పవరప్పాడు సమీపంలో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న కాలువలో కూరుకుపోయింది. మంగళవారం గూడూరు నుండి సైదాపురం మీదుగా చీకవోలు గ్రామానికి వెళ్తున్న ఈ బస్సు, మార్గమధ్యంలో తిప్పవరప్పాడు వద్దకు రాగానే అదుపుతప్పింది. ఇటీవల గూడూరు-సైదాపురం రోడ్డు అంచున పైపులైన్ల పనుల నిమిత్తం జేసీబీతో కాలువలు తవ్వడంతో రోడ్డు అంచు బలహీనపడి, మట్టి కోతకు గురైంది. ఇదే మార్గంలో వెళ్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డు అంచున రావడంతో ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి ఒరిగిపోయింది. బస్సు అకస్మాత్తుగా పక్కకు ఒరగడంతో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురై కేకలు వేశారు. అయితే, డ్రైవర్ అప్రమత్తతతో పాటు బస్సు వేగంగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రాణనష్టం గానీ, గాయాలు గానీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డు పక్కన అశాస్త్రీయంగా తవ్విన కాలువల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి తక్షణమే తగిన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# సినిమా న్యూస్

## ‘రంభ ఊర్వశి మేనక’ టీజర్.. నవ్వులు పంచేందుకు వస్తున్న అల్లరి నరేష్!

టాలీవుడ్ కామెడీ కింగ్ అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘రంభ ఊర్వశి మేనక’. చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ టీజర్ తాజాగా విడుదలైంది.

వంశపారంపర్యంగా వచ్చిన కోరికల బుక్‌తో భూమిపైకి రంభ, ఊర్వశి, మేనకలను పిలిచిన తర్వాత హీరో జీవితంలో చోటుచేసుకునే పరిణామాలే ఈ సినిమా కథ. రాశి సింగ్, విష్ణు ప్రియా, సురభి, ప్రిషా సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ఆద్యంతం కామెడీతో ఆకట్టుకుంటోంది. అల్లరి నరేష్ మార్క్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది.





## వర్కింగ్ డేలోనూ ‘కొరియన్ కనకరాజు’ దూకుడు!



మెగాహీరో వరుణ్ తేజ్ నటించిన ‘కొరియన్ కనకరాజు’ బాక్సాఫీస్ వద్ద జోరు కొనసాగిస్తోంది. తొలి వీకెండ్‌లో రూ. 37 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ సినిమా.. సోమవారం కూడా సత్తా చాటింది.

విడుదలైన నాలుగో రోజు బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ప్లాట్ ఫారమ్‌లలో 70 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. దీంతో ‘కొరియన్ కనకరాజు’ మండే టెస్ట్‌ను సక్సెస్‌ఫుల్‌గా పాస్ అయిందనే టాక్ వినిపిస్తోంది. మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా.. ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. సినిమా సక్సెస్ సందర్భంగా నిర్వహించనున్న వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

## జాన్వీ కపూర్ ఓటీటీ ఎంట్రీ..

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ త్వరలో ఓటీటీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ నిర్మాణంలో, సర్గుణం దర్శకత్వంలో తెరకెక్కుతున్న తమిళ వెబ్ సిరీస్‌తో ఆమె డిజిటల్ డెబ్యూ చేయనున్నట్లు టాక్. ప్రస్తుతం ఈ సిరీస్‌కు ‘కురత్తి’ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. సామాజిక అంశాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సిరీస్‌లో జాన్వీ తొలిసారి డిగ్లామరైజ్డ్, పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.తెలుగులో ‘దేవర’, ‘పెద్ది’ సినిమాలతో ప్రేక్షకులకు దగ్గరైన జాన్వీ.. ఇప్పుడు తమిళ ఓటీటీ స్పేస్‌లో ఎలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందో చూడాలి. అయితే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ‘జై హనుమాన్’లో ‘డీసీ’ బ్యూటీ?

ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ ‘జై హనుమాన్’పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ‘హను-మాన్’కు సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో రిషబ్ శెట్టి హనుమంతుడిగా, తేజ సజ్జ కీలక పాత్రలో కనిపించనున్నారు.

ఇక తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఇటీవల ‘డీసీ’ సినిమాతో ఆకట్టుకున్న వామికా గబ్బి ‘జై హనుమాన్’లో కీలక పాత్రలో నటించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఆమెది సినిమాలో పవర్‌ఫుల్ రోల్ అని ప్రచారం జరుగుతోంది.

అయితే వామికా గబ్బి ఎంట్రీపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్త నిజమవుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.



## ‘ఇరుముడి’ కథ ఏంటో చెప్పేసిన శివ నిర్వాణ!



మాస్ మహారాజ రవితేజ హీరోగా ‘మజిలీ’ ఫేమ్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘ఇరుముడి’. అయ్యప్ప భక్తి నేపథ్యంలో సినిమా ఉంటుందని భావించిన అభిమానులకు దర్శకుడు ఓ క్లారిటీ ఇచ్చారు.

‘ఇరుముడి’ కేవలం అయ్యప్ప స్వామి భక్తి లేదా శబరిమల యాత్ర నేపథ్యంలో సాగే సినిమా కాదని శివ నిర్వాణ తెలిపారు. 41 రోజుల అయ్యప్ప దీక్షకు ముందు, ఆ సమయంలో హీరో జీవితంలో చోటుచేసుకునే పరిణామాలే కథలో కీలకమని చెప్పారు.

ఫ్యామిలీ ఎమోషన్ డ్రామాగా మొదలయ్యే ఈ కథ.. క్రమంగా క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్‌గా మారి సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెడుతుందని దర్శకుడు వెల్లడించారు. చివర్లో హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలతో కథ ముగుస్తుందని తెలిపారు.

## RC17 కోసం రామ్ చరణ్ మాసీ మేకోవర్!



‘పెద్ది’ తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, లెక్కల మాస్టార్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం RC17. ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వైరల్ అవుతోంది. పాత్ర కోసం రామ్ చరణ్ ఏకంగా 15 కిలోల వరకు బరువు తగ్గనున్నట్లు సమాచారం. స్లిమ్ లుక్‌తో పాటు పొడవాటి జుట్టుతో చరణ్ సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారని టాక్. ఇప్పటికే సినిమా ఫస్ట్ హాఫ్ స్క్రిప్ట్ లాక్ కాగా.. సెకండ్ హాఫ్ క్లైమాక్స్‌పై సుకుమార్ టీమ్ వర్క్ చేస్తోంది. ఇక హీరోయిన్ విషయంలో వస్తున్న రుక్మిణి వసంత్ పేరు కేవలం ప్రచారమేనని తెలుస్తోంది. చరణ్ సరసన నటించే హీరోయిన్‌ను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం.‘రంగస్థలం’ మ్యాజిక్‌ను మించి ఈసారి చరణ్--సుకుమార్ కాంబో ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి!